# "బక్క గొర్రెకు బ్యారెం బెట్టెర కొచ్చాలమచ్చయ్య"

**నే**ను చిన్నంగున్నప్పుడు బడి పిల్లగాండ్లు కత్తెర్ల భూమయ్య కడుపూ, కమ్మరి బక్కయ్యకాల్లూ, వడ్లీరయ్య చేతులూ అని పాటలు పాడుకుంటురికెటోల్లు. గప్పున్నాకు గిట్లెందుకు పాడుతండ్రో సముజయ్యేది గాదు. కొంచెం పెద్ద పెరిగిన కరుతమైంది. కత్తెర్ల భూమయ్యకు పెద్ద బొర్రుండె. కమ్మరి బక్కయ్య కాల్లు కరెంటు స్తంభాలోలె పాడుగుండె, వడ్లీరయ్య సేతులు పీరీలకట్టెలోలె మస్తు పొడుగుండె. గందుకనే గిట్ల పాడెటోల్లు. గివ్వెవ్వలు కైగట్టింద్రో తెలువది గని పోరగాండ్లంత పాడెటోల్లు.

గొల్లోల్లవాడ పిల్లగాండ్లేమొ సాలెమచ్చయ్య కనవడితే 'బక్క గొర్రెకు బ్యారెం బెట్టెర కొచ్చాల మచ్చయ్యా!' అనుకుంటండెటోల్లు. మచ్చయ్యోల్లు వేరే ఊర్నుంచచ్చి మా ఊల్లె సాన్రోజులవట్టే ఉంటున్నరట. గందుకే అయినెను కొచ్చాల(కొత్త+సాల) మచ్చయ్యంటరని నాకటెనుక తెల్సింది.

చెవులకు పోగుల్తోని, జబ్బలకు దిగేసినట్టున్నంగి, సేతిల పొన్నుకట్టెతోనుండే మచ్చయ్యను సూత్తెనే నవ్వత్తది. నా చిన్నప్పటి కెల్లి సూత్తున్న మచ్చయ్య ఎలిసిపోకుంట ఎప్పటికి గట్లనే ఉంటుండు. అయినె బాగ ఇకమతులోడు.[86] కైతుకాల[87] పుటలు బలె మాట్లాడ్తడు. ఎక్కడున్నా సుట్టూర మందిని కూసోవెట్టుకొని శాత్రాలు సెప్పుతడు. నడుమ నడుమ మోటు సామెతలు, దిల్లగి మాటలు చెప్పి అందర్ని నవ్విత్తడు.

ఎక్కడ బక్క గొర్లుంటె అక్కడ మచ్చయ్యుంటడు. వాట్ని అగ్గోసగ్గోకు కొంటడు. కోసి పోగులేత్తడు. పోగులనమ్ముతడు. సగానికి సగం లాబం గొడుతడు. చచ్చిపెయిన గొర్లంగూడ అయినెదగ్గెరికే కొంచవోతరు గొల్లోల్లు. వాట్ని సూసి "బొంత పురుగు పడ్డదానె? ఎంతకిత్తవు?" అనడుగుతడు. బతికుంటె వందల్లుండె గొర్రెకు అరువయో, డెబ్బయో అంటరాల్లు.

"గీ సచ్చిందాన్నెవ్వలు గొంటరే? నేంబోతన్న" అనుకుంటురుకుతడు మచ్చయ్య.

"అట్లాగె మచ్చన్న. గట్లురుకుడెందుకే. ఎంతకు గావన్నో సెప్పు!" అని గొల్లయినన్నెమొలె అగి గొర్రె దగ్గెరికత్తడు.

"ఎంతయిన మాట్లాడకుంటనే ధర జెప్పితివి. ఇగేమడుగాలె?"

"ఎంతకో అడుగలేవు. ఇదేమన్న కొత్తా. నువ్వు కొంటలేవా? మేమమ్ముతలేమా?"

"నాలుగు సేతులకియ్యి" అనుకుంట పొబోతడు మల్ల. అంటె ఇరువై రుపాయలకన్నట్టు.

"ఇన్నూర్రూపాయల మాలు వొయ్యి మేమేడుత్తంటె గింతన్యాయమాయె. తోలుకే షదత్తయిగాదె. యాబయన్న జేసుకో.

"బతుకుతె ఎంతయిన పెట్టచ్చుగని సచ్చిందానికెవ్వలు పెడుతరు సెప్పు? ఇంకో గంటుంటె, మురుగు వత్తది. నేం జెప్పిన పైసలు గూడ రావు" అని పొబోతె గొల్లోల్లాపుతరు.

"ఇల్లు గాలొగడేడుత్తంటె ఇంకొగడెందుకో ఏడ్సిండట. గింత మాలు వొయ్యి మేమేడుత్తంటె నీకు పరాశికాలు గావట్టె. నలుపయిన్న సేసుకోలేవిగ"

"అరు సేతలకన్నెన్నో ఒక్క పైస గూడియ్య. ఇగ మీ ఇట్టం." అని పోయినట్టే సేత్తడు.

"కొంచెమంత నిల్సుండ్రి మాట్లాడుతేందె? ఇంకో ఐదు జేసుకో" అని బతిమిలాడ్తరు గొల్లోల్లు.

దాన్ని కోసిపొగులేసమ్ముతడు మచ్చయ్య. గిసొంటి బ్యారాలు గాంగ నేనెన్నోసార్ల జూసిన.

రొండు మూడు దినాలకోపారి బక్క గొర్రెనన్న చచ్చిపెయిన గొర్రెనన్న కోసమ్ముతడు మచ్చయ్య. ఇగ అయుటిపూని[88] సినుకు పడ్డదంటె మచ్చయ్యకు పండుగే. గొల్లోల్లకు గుండెలల్ల దడ వుడుత్తది. అయుటిపూనినంక మొల్సిన కొత్తగడ్డిమేసి మంచి మంచి పాడిపిల్లలు గూడ సిటుకు రోగమచ్చెగిరి సత్తయి. గట్ల రోజు కొంత పడుతలు పడుతది మచ్చయ్యకు. మొదాలు మా ఊళ్ళెకచ్చినప్పుడే లేదట మచ్చయ్యకు.

గీ బక్క గొర్ల, సచ్చినగొర్ల బ్యారంతోనే ఇన్నన్ని పైసలు సంపాయించిండట. అటెనుక గొర్లబ్యారమట్ల సేసుకుంటనే పైసలను వడ్డికి తిప్పుడు మొదలు వెట్టిండట.

"మచ్చన్నా! మా ఆడిదానికి బాగ జెరమచ్చిందే. కన్నాగురం తీసుకపోవాలె. ఒక్క యాభయియ్యి"

"మచ్చన్నా! సుట్టపొడచ్చిండు. కల్లు మాంసం దేవాలె. ఒక్కో ఇరువ యుంటియ్యి....."

"బాగెక్కరుండే. పంటమీదిన్ని వడ్లు కొలుత్త గని ఒక్క నూర్రూపాలియ్యి"

గిట్లడిగి ఊరోల్లయినె దగ్గెర పైసల్దీసుకపోతరు. అల్లవుసరాన్ని సూసి మీదిమీదికి పోతడయినె. నెలకు పదికి పదకొండు తీసుకుంటడు కొద్దిగ పైసలయితె. గొల్లోల్లకయితె నూరిన్నూరిచ్చి అర్నెల్లకో యాడాదికో మిత్తికిందికోగొర్రెపిల్లం దీసుకుంటడు. రైతులకు పైసలిచ్చి పంటమీద వడ్డికిందికో బస్తవడ్లు దీసుకుంటడు. ఎన్ని జేసినా బక్కగొర్ల బ్యారాన్నిడువలె. గదే తనను పెద్దోన్ని సేసిందంటడు.

చేతులన్నన్ని పైసలున్నయని ఉరుకులాడద్దంటడు. అణిగిమనిగుంటెనే లచ్మిదేవి దగ్గెరుంటదని

కొడుకులకు పంచిత్తడు. రోజు సాయింత్రం వాడుకంబింక ఇంటికత్తది. పరాకతుగ[89] తాగుతడు. ముసలోడయినా ఇంకా సంపాయిత్తనే ఉన్నడు మచ్చయ్య.

నలుగురు కొడుకులేరువడ్డరు. అందరికి మంచిగనే పంచిచ్చిండు. చిన్నోనిమీద ప్రేమెక్కువ. అందుకోసం సిన్నోనితోనున్నడు. పెద్దల్లకు తెలువకుంటుంచుకున్నది చిన్నోనికే ఇచ్చిండు.

ఓపారి పానంబాగలేక దవాకాండ్ల వడ్డడు. ఇగ కొడుకులమీన ఒక బలిమి గాదు. కొడుకులనురికిచ్చుడే ఉరికిచ్చుడు. ఏదంటది తెప్పించుకున్నడు. కొంచెమాల్చెమయితె నోటికచ్చినట్టల్ల తిట్టిండు. డబ్బై యేండ్లు దాటిన మచ్చయ్య ఇప్పటిగ్గూడ సలాకోల్నే ఉన్నడు. సంపాయిత్తండు. కైత్కాల మాటలు మాట్లాడుకుంట నవ్విత్తనే ఉన్నడు. ఓపారి మా నాయిన్న దగ్గెరికచ్చి తన సంగతి సెప్పిండు.

"ఓదన్నా! నేనెంత సంపాయిత్తేమున్నదే! పాసుపండ్లోడు సంపాయిత్తె బంగారిపండ్లోడు ఖర్చు జేసినట్టు చిన్నోడు పైసలను నీల్లలెక్కనే ఖర్చు వెడుతండే. రోజు కుండలకు కుండలు తాగుడు. మల్ల ఒక్కడన్నగాదు. నలుగురైదుగుర్ని ఎంబడేసుకోని తాల్లల్లకు పోతడు. వాన్ని ఎన్ని పనులల్ల వెట్టినా అన్నిట్ల సున్నే సేసిండు. మల్లాడు సిన్న పొల్లగాడన్న గాకపాయె. ఆనికి పిల్లగండ్లయిరి. నేం బోయినంకాడెట్ల బతుకుతడో ఏమోనే నాకయితె అరుతమయిత లేదు".

మల్లోసారచ్చి సిన్నవోయిన మొకంతోని గిట్లన్నడు.

"ఓదన్నా! ఇగ నాకు సాతగాకుంటయితంది. నేం జంపాయించిందయితె అందరు దీసుకున్నరు. కుక్కల వడితె ఎవ్వలు నా మొకం సూసెటట్టు కనవడుతలేరు. ఒక్కడు గిన్ని గంజినీల్లు పోసె అందాజ కనవడుతలేదు. లోకమే గట్ల పాడైంది తియ్యి. అందుకోసురం కాల్లు సేతులాడినప్పుడే గుస్సుమంటయిపోతది. మంచాలవడి వాన్తోని వీన్తోని సేయించుకుంట గునిపెండ్లు పడుడుకంటె సాతనయినప్పుడు సచ్చిపెయిందే నయ్యం....."

ఎప్పుడూ నవ్వుకుంట తీరు తీరు శాత్రాలు సెప్పుకుంట వ్విచ్చుకుంటుండె మచ్చయ్య నోట్లెకెల్లి గా మాటలిని నేనాశ్చెర్యపెయిన. అవు మరి ఎంతోమంది అరువకట్టపడి సంపాయిచ్చి కొడుకులకిత్తె కొడుకులు తండ్రులను ముసలోల్లయినంక ఇంట్లకెల్లి ఎల్లగొట్టి నోల్లున్నరు. గిసోంటి యెన్నో రోజు కనవడ్తనే ఉన్నయి.

"గా సావు మన సేతులుందానె మచ్చన్న. ఎట్లుంటె గట్లయితది. కని ఎప్పటికైన మన సేతుల్ల కొన్ని పైసలుంచుకోవాలె" అన్నడు మా నాయిన్న.

బాగాలోసిత్తె గా మాటల్ల నిజెముందనిపిత్తంది నాకు.